29న టీ-హబ్‌లో నేషనల్ బిజినెస్ లీడర్స్ అవార్డ్స్



నేషనల్ బిజినెస్ లీడర్స్ అవార్డ్స్ లోగోను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సుల్తాన్‌బజార్: మాదాపూర్‌లోని టీ-హబ్‌లో ఈనెల 29న 'నేషనల్ బిజినెస్ లీడర్స్ అవార్డ్స్' ప్రదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్యాక్స్ ఫైలింగ్ ఫౌండర్ ఇండియా కంపెనీ ఫౌండర్, సీఈఓ చల్లూరి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో కార్యక్రమం లోగోను ప్రపంచ పర్యావరణ సంస్థ ఫౌండర్ అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ భద్రతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యాపార రంగాల్లో యువతకు మెలకువలు నేర్పిస్తూ వారి ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించేందుకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాపారవేత్తలు ఇందులో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ అవార్డుల కార్యక్రమానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క, ఎంపీ ఆర్.కృష్ణయ్య, మూడు రాష్ట్రాల ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్, కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్, జస్టిస్ చంద్రకుమార్ తదితరులు హాజరవుతారన్నారు. సుమారు 300 నామినేషన్స్ వచ్చాయని తెలిపారు. అలాగే త్వరలో లండన్‌లో కూడా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నేషనల్ ఓబీసీ నేత రాంప్రకాష్ మాలి, ఎంబీసీ నేత ప్రదీప్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును మూసివేశారంటూ..


తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు


గ్రామస్తులతో మాట్లాడుతున్న నార్సింగి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్‌రెడ్డి

- పలు గ్రామాల ప్రజల ఆందోళన
- ఆర్‌డీఓ, తహసీల్దార్‌కు వినతులు

మణికొండ: అనాదిగా ఉన్న రోడ్డును అకస్మాత్తుగా మూసివేయటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే తెరిపించాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది ఆందోళనకు దిగారు. అనంతరం రాజేంద్రనగర్ ఆర్‌డీఓ, గండిపేట తహసీల్దార్‌లకు వినతిపత్రాలను అందజేశారు. సంఘటనా స్థలానికి వెళ్లిన నార్సింగి మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్‌రెడ్డి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో వారు శాంతించారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. నార్సింగి మున్సిపాలిటీ రాయల్ ఫంక్షన్‌హాల్ ముందు నుంచి డ్యూస్ విల్లాస్ పక్క నుంచి ఉన్న మట్టి రోడ్డులో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. సదరు రోడ్డును రూ.50లక్షలతో సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు మున్సిపాలిటీలో తీర్మానం సైతం చేశారు. దీంతో రోడ్డు ఉన్న భూమి మా పట్టా భూమి అని పక్కనే ఉన్న ఓ రియాల్టీ వారు ఇటీవల రేకుల షీట్‌లను అడ్డుపెట్టి మూసి వేశారు. దాంతో హైదర్‌షాకోట్, గంధంగూడ, బండ్లగూడ తదితర ప్రాంతాలకు చెందిన ఐటీ, ఇతర ఉద్యోగులు టిప్పుఖాన్‌పూల్ నుంచి తిరిగి వెళ్లాల్సి వస్తుంది. బుధవారం ఉదయం మూసిన రోడ్డును తెరిపించాలనే డిమాండ్‌తో వందలాది మంది ఆందోళనకు దిగారు. అనంతరం వారు రాజేంద్రనగర్ ఆర్‌డీఓ వెంకట్‌రెడ్డి, గండిపేట తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలను అందజేశారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం: పవన్‌కుమార్‌రెడ్డి, కమిషనర్, నార్సింగి

రోడ్డు గురించి ఆందోళన చేస్తున్నారనే విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి వెళ్లాము. అనాదిగా ఆ రోడ్డును వాడుతున్నామని, అది గతంలో పానాది, బండ్లబాట రోడ్డు ఉందని, దాన్ని అకస్మాత్తుగా మూసి వేశారని తెలిపారు. రోడ్డు ప్రభుత్వ భూమిలో నుంచి ఉందా, పట్టా భూమిలో ఉందా అనే విషయాన్ని తేల్చాలని తహసీల్దార్‌కు లేఖ రాస్తాం. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రజల ఇబ్బందిని తొలగించేందుకు ప్రయత్నిస్తాం.

నాడు ఇబ్బంది.. నేడు సాఫీగా..


గద్దెను తొలగించడంతో ప్రస్తుతం సాఫీగా రాకపోకలు


గతంలో విప్రో సర్కిల్‌లో ప్రధాన కూడలి మధ్యలో గద్దె (ఫైల్)

రాయదుర్గం: ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని ప్రధాన కూడలిలో నేడు వాహనాలు సాఫీగా రాకపోకలు సాగించేందుకు అవకాశం కలుగుతోంది. ఒకప్పుడు ఈ కూడలి మధ్యలో సెంట్రల్ లైటింగ్ దాని చుట్టూరా గద్దె నిర్మించి గ్రీనరీ ఏర్పాటు చేశారు. కానీ వాహనదారులు దీని చుట్టూ ప్రయాణించాల్సి వచ్చేది. కానీ దీన్ని తొలగించి వేయడంతో ప్రస్తుతం నలు దిక్కులా వాహనదారులు సాఫీగా రాకపోకలు సాగించేందుకు మార్గం సుగమం అయింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని పలు ఐటీ, ఇతర అంతర్జాతీయ సంస్థలకు వెళ్ళేందుకు ఇదే ప్రధాన కూడలి. దీనికి తోడు ఔటర్ రింగురోడ్డు, గౌలిదొడ్డి, గోపన్‌పల్లి, కేశవనగర్ వంటి ప్రాంతాలకు వెళ్ళేందుకు కూడా ఇదే ప్రధాన కూడలి కావడంతో దీనికి అత్యంత ప్రాధాన్యత పెరిగింది. ముఖ్యంగా ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు, ఆతర్వాత సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ కూడలిలో వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో టీఎస్ఐఐసీ అధికారులు చర్యలు తీసుకోవడంతో మార్గం సుగమమైంది.

రేషన్ షాపు తనిఖీ

శేరిలింగంపల్లి: ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సివిల్ సప్లయ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్ మాచన రఘునందన్ తెలిపారు. శేరిలింగంపల్లి తారానగర్‌లో ఇటీవల సీల్ వేసిన చౌకధరల (346) దుకాణాన్ని బుధవారం తనిఖీ చేశారు. సీజ్ చేసిన దుకాణాన్ని తనిఖీ చేయగా నిల్వల్లో భారీగా తేడాలు ఉన్నట్లు గుర్తించామని, సుమారు 90 క్వింటాళ్ళ పైగా బియ్యం నిల్వలు తక్కువగా ఉన్నట్లు వెల్లడైందని వివరించారు. డీలర్‌పై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంజాయి పట్టివేత

ఒకరి అరెస్ట్.. సెల్‌ఫోన్ స్వాధీనం

హఫీజ్‌పేట్: లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద పది కిలోల గంజాయిని పట్టుకున్నారు పోలీసులు. ఈ ఘటన శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన ప్రకారం.. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరికి చెందిన రాహుల్ బైద్య (21) గంజాయికి బానిసయ్యాడు. అదే ప్రాంతానికి చెందిన జగన్నాథ్ బిస్వాస్‌లు కలిసి డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో హైదరాబాద్‌లో నివాసముండే విక్రమ్ అలియాస్ వివేక్‌కు గంజాయి విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఒడిశా నుంచి హైదరాబాద్‌కు సుమారు 10 కిలోల గంజాయిని తరలిస్తుండగా సమాచారమందుకున్న శంషాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి కృష్ణప్రియ ఆదేశాలతో, శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులతో కలిసి లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు చేపట్టారు. అక్కడ రాహుల్ బైద్య అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో వెంటనే ఎక్సైజ్ పోలీసులు గమనించి అదుపులోకి తీసుకుని చూడగా బ్యాగులో గంజాయిని గుర్తించారు.
దీంతో శంషాబాద్ టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ పోలీసులు శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అతని వద్ద నుంచి 10 కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్ట్ చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. త్వరలోనే వారిని కూడా అరెస్ట్ చేస్తామని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో శంషాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ సభ్యులు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువలో ప్రభుత్వ వైద్యం

- గచ్చిబౌలి డివిజన్‌లో మూడు బస్తీ దవాఖానాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- సౌకర్యాలు కల్పిస్తే మరింతగా వినియోగించుకునే అవకాశం



రాయదుర్గం పట్టణ ఆరోగ్య కేంద్రం



మధురానగర్‌లోని బస్తీదవాఖాన

రాయదుర్గం: ప్రభుత్వం బస్తీ దవాఖానాల పేరిట ప్రజల చెంతకే వైద్యం అందిస్తోంది. నగరంలోనే ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఉన్న ప్రాంతమైన గచ్చిబౌలి డివిజన్‌లో మూడు బస్తీ దవాఖానాలు, ఒక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుతో పేదలకు ప్రభుత్వం మరింత చేరువగా మారినట్లయింది. వీటిల్లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేకూరడం ఖాయం. కాగా ప్రస్తుత పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని విస్తరించి సొంత భవనం ఏర్పాటు చేసి ఇన్‌పేషెంట్లు కూడా చేరేలా సౌకర్యాలు కల్పిస్తే ఎంతో ఉపయుక్తంగా మారుతుందని పలువురి అభిప్రాయం.

అందుబాటులో 3 బస్తీ దవాఖానాలు.. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- గతంలో ఏదైనా అనారోగ్యానికి గురైతే కొండాపూర్‌లోని ఏరియా ఆస్పత్రి లేదంటే ప్రైవేటు ఆస్పత్రికి వెళ్ళాల్సిన పరిస్థితి
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నగరంలో మొదటి విడతగా బస్తీ దవాఖానాలు మంజూరు కాగా అందులో మూడింటిని గచ్చిబౌలి డివిజన్‌లో ఏర్పాటు చేశారు.
- మధురానగర్, గోపన్‌పల్లి, గౌలిదొడ్డిలో మూడు అందుబాటులోకి వచ్చాయి. ఈ మూడింటిని జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాళ్లలో ఏర్పాటు చేయడంతో అద్దె సమస్య లేదు
- ఔట్ పేషెంట్లకు వైద్య పరీక్షలు, మందులను కూడా అందిస్తుండడంతో రావడానికి ప్రజలు మొగ్గు చూపుతున్నారు
- ఇక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూడా ఏర్పాటు కావడంతో రాయదుర్గంలోని కాలనీలు ,బస్తీల వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంది
- కాగా రాయదుర్గంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గతంలో వార్డు కార్యాలయ భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లో కొనసాగిస్తున్నారు.
- ఇది కేవలం ఔట్ పేషెంట్లకు మాత్రమే పరిమితమైంది.
- ఈ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్థలం కేటాయించి సొంత భవనం నిర్మించి 30 పడకల ఆస్పత్రిగా మారిస్తే స్థానికులతో బాటు చుట్టూరా ఉండే సుమారు 12వేల మంది జనాభాకు ఎంతో మేలు చేకూరడం ఖాయం.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం


పూజ చేస్తున్న శ్రీ మాధవానంద సరస్వతీస్వామి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ఆదర్శనగర్‌లోని రేణుక ఎల్లమ్మ దేవతా సహిత నాగప్రతిష్ఠ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా బుధవారం ఉదయం గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనము, పంచగవ్య విధి, అఖండ దీపారాధన, ఋత్వికరణ, యాగశాల ప్రవేశం, నవగ్రహ మాతృకాస్థాపనములు, ప్రధాన దేవతా స్థపన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. తొగుట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతీ స్వామి వారు పూజలు చేసి ఆశీస్సులు అందజేశారు.

సన్మానం


జైపాల్‌ను సన్మానించిన విజయ్‌కుమార్

హఫీజ్‌పేట్: వెనుకబడిన కులాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన జెరిపాటి జైపాల్‌ను బుధవారం హోప్ ఫౌండేషన్ చైర్మన్, హాకీ తెలంగాణ అధ్యక్షులు కొండ విజయ్‌కుమార్, హఫీజ్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈ.లక్ష్మణ్ రావులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు కార్యక్రమంలో రెడ్డి ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయాల్లో అన్నదానం

మోతీనగర్: మూసాపేట డివిజన్‌లోని మోతీనగర్ ప్రధాన రోడ్డులోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో ప్రతి గురువారం అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అదే విధంగా పాండురంగనగర్ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అవంతినగర్ తోట శ్రీషిరిడి సాయిబాబా దేవాలయంలో, స్నేహపురి కాలనీలో, అల్లాపూర్ డివిజన్ శ్రీ గణేష్ నగర్ సాయిబాబా దేవాలయం, శ్రీ వివేకానందనగర్ షిరిడి సాబాబా దేవాలయాల్లోనూ అన్నదానాలు కొనసాగుతున్నాయి.

మహిళా సమాఖ్య లీడర్ల సమస్యలు పరిష్కరిస్తా

ఆల్విన్‌కాలనీ: మహిళా సమాఖ్య లీడర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని మహిళా సమాఖ్య లీడర్లు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలపై చర్చించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ సమస్యలను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమాఖ్య లీడర్లు షేక్ బీబీ, సౌందర్య, నిర్మలమ్మ, లలిత కుమారి పాల్గొన్నారు.

పంచశీల స్కూల్‌లో ఆధార్ సెంటర్ ఏర్పాటు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో 5 సంవత్సరాల్లోపు చిన్నారులకు ఆధార్ అప్‌డేట్ చేసుకునేందుకు ఆధార్ సెంటర్ ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కేంద్రం అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

విభాసంగీత కృష్ణకుమార్‌కు ఉత్తమ రచయిత అవార్డు



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థిని విభా సంగీత కృష్ణకుమార్‌కు ఉత్తమ మాన్యుస్క్రిప్ట్‌గా2024 ఆథర్ అవార్డును గెలుచుకున్నారు. హెచ్‌సీయూలో ఐఎంఎస్‌సీ(బయాలజీ) విద్యార్థి, ఒక ప్రదర్శనకార కర్నాటక గాయకుడు. 'కౌసల్య దిక్వీన్ ఆఫ్ హార్ట్స్' అయోధ్యరాణిపై పౌరాణిక కల్పన ఉత్తమ మాన్యుస్క్రిప్ట్‌గా ఎంపిక చేయబడింది. దీనిని టైమ్స్ ఆఫ్ ఇండియా సహకారంతో జీకే పేపర్ అందించింది. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన 5వ రచయిత్రి అవార్డుల వేడుకలో ప్రముఖ నటి షర్మిలాతాగూర్ నుంచి విభా అవార్డును స్వీకరించారు. ఆమెను పలువురు ఫ్యాకల్టీ, విద్యార్థులు అభినందించారు.

నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న డా.రాము నోముల

పటాన్‌చెరు: గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ (జీఎస్పీ) లో బుధవారం 'ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని' నిర్వహించారు. 'పరిశుభ్రమైనై నోరే.. ఆరోగ్యకరమైన దేహం' అనే ఇతివృత్తంతో జరిగిన ఈ కార్యక్రమంలో రూట్ కెనాల్, ఫేషియల్ ట్రామా కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ రాము నోముల ముఖ్య అతిథిగా హాజరై ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో నోటి పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యతను చెప్పారు.నోటి ఆరోగ్యం, దేహ సమస్యల మధ్య సంబంధాన్ని డాక్టర్ రాము ప్రస్తావిస్తూ, నోటి నుంచి బ్యాక్టీరియా రక్తంలోకి ప్రవేశించి శరీరంలోని ఇతర భాగాలపై ప్రభావం చూపుతుందన్నారు. పళ్ల మధ్య ఖాళీలు, చిగుళ్ల వ్యాధి, నోటి దుర్వాసన వంటి సాధారణ దంత సమస్యలను నివారించడంలో క్రమబద్ధంగా బ్రష్ చేసుకోవడం, ఫ్లాసింగ్ వంటి పద్ధతులను ఆయన వివరించారు.ఆత్మీయ అతిథిగా పాల్గొన్న కాస్మెటిక్ డెంటల్ సర్జన్ డాక్టర్ కె.మౌనిక మాట్లాడుతూ రోజుకు రెండుసార్లు మెత్తటి బ్రష్‌తో పళ్ల తోమడం, నాలుకను శుభ్రం చేయడం, చక్కెరను పరిమితంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొ.శివకుమార్, అసిస్టెంట్ ప్రొ.డా.పవన్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరంతర పరిశోధనతోనే నూతన ఆవిష్కరణలు

హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

రాయదుర్గం: నిరంతర పరిశోధనతోనే నూతన ఆవిష్కరణలు సాధ్యమని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం, ఏర్పాటు చేసిన ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమంలో ఆన్‌లైన్‌లో హెచ్‌సీయూ తెలుగు శాఖ కార్యాలయం నుంచి ఆయన బుధవారం మాట్లాడారు. శాస్త్రీయ విధానమే పరిశోధన అని, దాని కోసం ఎంతో అనుభవంతో అందించిన పుస్తకాలు, ప్రసంగాల ద్వారా పరిశోధనల్లోని మెళకువలను గ్రహించాలన్నారు. క్షేత్ర పర్యటనలో సేకరించిన సమాచారం ఆధారంగా రూపొందే పరిశోధనలు మౌలిక అంశాలను అందిస్తాయని అటువంటి వాటిని పరిణామాత్మక పరిశోధనలని పిలుస్తారన్నారు. హెచ్‌సీయూ, ఉస్మానియా, యోగి వేమన, ఆంధ్ర, ఢిల్లీ, మద్రాసు, కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయాల్లో ఈ మధ్య తెలుగు పరిశోధనలపై సదస్సులు, వర్క్‌షాపులు, ప్రత్యేక ఉపన్యాసాలు జరుగుతున్నాయని ఇది తెలుగు పరిశోధనలకు మంచి శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

చేవెళ్లలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం



కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

శంషాబాద్: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం సాధించనుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ నేతల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని పదేళ్ల బీజేపీ పాలన, రాష్ట్రంలో మూడు నెలల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. కేసీఆర్‌ను నేరుగా ఎదుర్కొనే సత్తా లేకపోవడంతోనే ఎన్నికల కుట్రలో భాగంగా బీజేపీ ఈడీని అడ్డుపెట్టుకుని అక్రమ కేసులు బనాయిస్తోందని ఆరోపించారు. ప్రజాసంక్షేమానికి వ్యతిరేకంగా కేంద్ర సర్కారు తీసుకున్న నిర్ణయాలను గత ప్రభుత్వం వ్యతిరేకించి ప్రజల పక్షాన నిలబడిన సందర్భాలు అనేకం ఉన్నాయని గుర్తు చేశారు. అడ్డగోలు హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు వాటిని నెరవేర్చడంపై మాత్రం దృష్టి పెట్టడం లేదని మండిపడ్డారు. బడుగు, బలహీన వర్గాల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుని కేసీఆర్‌కు కానుకగా ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీ, కాలె యాదయ్య, ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, సీనియర్ నాయకులు కార్తీక్‌రెడ్డి, ఆర్. గణేశ్ గుప్తా, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్ చైర్మన్ బండిగోపాల్ యాదవ్, జెడ్పీటీసీ తన్వీ, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు డి. వెంకటేశ్‌గౌడ్, కౌన్సిలర్లు అజయ్, మేకల వెంకటేశ్, జహంగీర్, భారతమ్మ, పుష్పలత, విజయలక్ష్మి, నాయకులు మంచర్ల శ్రీనివాస్, నీరటి రాజు, మురళి, శ్రీనివాస్‌గౌడ్, జి.వై ప్రభాకర్, కొనమొల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమాచారం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వేస్టేషన్ నుంచి దూర ప్రాంతాలకు బయలుదేరు రైళ్ల వివరాలు..

◆ 4.40	అమరావతి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్	లింగంపల్లి -విజయవాడ
◆ 6.15	జన్మభూమి ఎక్స్‌ప్రెస్	లింగంపల్లి -వైజాగ్
◆ 12.25	దేవగిరి ఎక్స్‌ప్రెస్	లింగంపల్లి- సీఎస్ఎంటీ (ముంబాయి)
◆ 18.25	నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్	లింగంపల్లి - తిరుపతి
◆ 18.30	కోకనాడ ఎక్స్‌ప్రెస్	లింగంపల్లి - కాకినాడ (సోమ, బుధ, శుక్ర) (19.00 మంగళ, గురు, శని)
◆ 20.30	గౌతమి ఎక్స్‌ప్రెస్	లింగంపల్లి-కాకినాడ
◆ 21.05	నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్	లింగంపల్లి-నర్సాపూర్
◆ 21.40	హంసఫర్ ఎక్స్‌ప్రెస్	లింగంపల్లి-ఇండోర్ (ఆదివారం)

త్వరలో 'మనూ'లో కమ్యూనిటీ రేడియో ప్రారంభం

10 నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో పనిచేసేలా ఏర్పాట్లు

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంలో కమ్యూనిటీ రేడియో సేవలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. యూనివర్సిటీలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా కేంద్రంలో దీన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కమ్యూనిటీ రేడియో విద్య, సమాచార వ్యాప్తి ద్వారా సామాజిక అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా బుధవారం యూనివర్సిటీ క్యాంపస్‌లో ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పలు నిర్ణయాలు చేశారు. 'మనూ' క్యాంపస్ చుట్టూ 10 నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో నివసించే నివాసితులు కమ్యూనిటీ రేడియో ప్రోగ్రామింగ్ కోసం వారి ఆలోచనలు, అంచనాలు, సమస్యలను పంచుకోవడానికి అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం రిజ్వాన్ అహ్మద్ కమ్యూనిటీ రేడియో ప్రాముఖ్యత, ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు.

సంతాప సభ

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం మొదటి ఫైనాన్స్ ఆఫీసర్ బి నారాయణకు సిబ్బంది బుధవారం నివాళులర్పించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సంతాప సమావేశంలో యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మృతుడి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.కార్యక్రమంలో ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ సయ్యద్ మహ్మద్‌హష్మీ, మహ్మద్, డాక్టర్ ఎం ఏఖుద్దూస్, సెక్షన్ ఆఫీసర్ ఆర్ శ్రీనివాస్ సంతాపం ప్రకటించారు. అనంతరం అందరూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

టీకాలు తప్పనిసరిగా వేయించాలి

పటాన్‌చెరు టౌన్: పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పటాన్‌చెరు మండలం పశువైద్యాధికారి శైలేంద్ర జస్వాల్ అన్నారు.పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్ల గ్రామంలో 526 పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈ సందర్భంగా శైలేంద్ర జస్వాల్ మాట్లాడుతూ...మూడు నెలలు పై బడిన పశువులన్నిటికీ ఈ టీకాలు వేయించాలన్నారు. ఎక్కడైనా పశువుల్లో గాలికుంటు వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానికంగా ఉన్న పశువైద్యశాలలను సందర్శించాలన్నారు.ప్రభుత్వం చేపడుతున్న ఈ ఉచిత టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాల సూచించారు.అలాగే బండ్లగూడలో పశువులకు గాలికుంటు టీకాలు వేశారు.ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి వంశీకృష్ణారెడ్డి, సిబ్బంది సరిత పాల్గొన్నారు.

చెట్లు కొట్టివేసిన బిల్డర్‌కు జరిమానా

మణికొండ: రోడ్డు పక్కనున్న చెట్లను కొట్టినందుకు మున్సిపాలిటీ అధికారులు ఓ బిల్డర్‌కు రూ. 20 వేల జరిమానా విధించారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీ, రోడ్డు నంబర్ 15 ఏలో బిల్డర్ ఎం. రామారావుకు స్థలం ఉంది. అందులో భవనాన్ని నిర్మించుకునేందుకు ఫ్లాట్ పక్కనే అడ్డుగా ఉన్న రెండు చెట్లను కొట్టివేశాడు. ఈ విషయం తెలుసుకున్న మణికొండ మున్సిపాలిటీ అధికారులు చెట్లను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని రూ. 20 వేల ఫైన్ వేశారు. మున్సిపాలిటీ పరిధిలో ఎవరూ చెట్లను కొట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు

ఊర పిచ్చుకలపై అవగాహన



ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం ప్రపంచ ఊర పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత సకశేరుక చీడల యాజమాన్య విభాగం వారు రాజేంద్రనగర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి ఊర పిచ్చుకల జీవన విధానంపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ఉచితంగా కృత్రిమ పిచ్చుక గూళ్లను పంపిణీ చేశారు. కృత్రిమ పిచ్చుక గుళ్లను అమర్చే, వాటిని పరిశీలించే విధానాన్ని సమగ్రంగా వివరించి పిల్లలతో స్లోగన్స్ చెప్పించి పిచ్చుకలను కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు. ప్రపంచ వ్యాప్తంగా 2010 నుంచి మార్చి 20న యేటా ప్రపంచ ఊర పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారత సకశేరుక చీడల యాజమాన్య విభాగం ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ అనురాధ, డాక్టర్ పి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో 10 ఏళ్ల జైలు


నిందితుడు మిదసాల శివకృష్ణ

గచ్చిబౌలి: బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధించారు. గచ్చిబౌలి సీఐ ఎస్.ఆంజనేయులు తెలిపిన ప్రకారం ఏపీలోని ప్రకాశం జిల్లా, జురుగున్‌మల్లి మండలం, నందన్‌వనం గ్రామానికి చెందిన మిదసాల శివకృష్ణ (32) బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వచ్చాడు. గచ్చిబౌలి వినాయక్‌నగర్‌లోని ఓ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. సమీపంలో నివాసం ఉండే ఐదవ తరగతి చదువుతున్న ఓ బాలిక(13)పై 2014 అక్టోబర్ 20న అర్ధరాత్రి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక తండ్రి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ జూపల్లి రమేష్ కుమార్ కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. పదేళ్ల అనంతరం ఈ కేసులో రాజేంద్రనగర్ స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ జడ్జి పి.ఆంజనేయులు తీర్పునిస్తూ నిందితుడికి పదేళ్ల జైలు, రూ.6 వేలు జరిమానా, బాధిత బాలిక కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని ఆదేశించారు.